**కథానిక**

# “ముడుపు”

మల్లాది వెంకట కృష్ణమూర్తి

దాదాపు ఇరవై నిముషాలనుంచి తనవంకే ఓరగా, ఆశగా, దాదాపు తినేసేలా చూస్తున్న తెల్లచొక్కా అతని వైపు చూసింది వసుమతి. రెండు కళ్ళు తమాషాగా ఆర్పుతున్నాడు.

వసుమతి నవ్వీ నవ్వనట్లుగా నవ్వింది. అతను వసుమతి ప్రక్కన వచ్చి నిలబడి అద్దాల కేస్‌లోని స్టిల్స్‌ని, మధ్య మధ్యలో దొంగతనంగా వసుమతి పెదవుల్ని, బుగ్గలని, మెడని చూస్తున్నాడు.

వసుమతి అతని మొహంలోకి సూటిగా చూసి నవ్వింది. అతనూ నవ్వాడు.

“సినిమాకి వచ్చారా?” అడిగింది అతనెవరో తెలియక పోయినా.

“అవును మీరు?”

“ఒంటరిగా” అని నవ్వి, “దయచేసి నాకో ఓ డ్రస్ సర్కిల్ టిక్కెట్ తెచ్చిపెట్టండి” అన్నది. హేండ్‌బేగ్ తెరచి అయిదు రూపాయల నోటు అందించబోతుంటే, అది అందుకోకుండా అన్నాడు.

“ఫర్వాలేదు నే తెస్తాను.”

“కొంపతీసి మీ డబ్బుతో చూపిస్తారా ఏమిటి?” అడిగింది వసుమతి అతనిలా కళ్ళు ఆర్పకుండగా నవ్వుతూ.

“అవును, అభ్యంతరమా?”

రెండు టిక్కెట్లు తెచ్చి అన్నాడు ఉషారుగా.

“పదండి.”

ఇద్దరూ కార్పెట్ పరిచిన మెట్లెక్కి పైకి వెళ్ళారు. తన అదృష్టానికి సంతోష పడుతున్నాడు తెల్లచొక్కా అతను.

“అలా కూర్చుందామా?” అడిగాడు ఓ మూలగా జనంలేని సీట్లవంక చూస్తూ.

“మీరు అలా కూర్చోండి. నేను ఇలా కూర్చుంటాను. సినిమా చూపిస్తున్నందు థాంక్స్”

అతను తెల్లబోయి చూస్తుంటే వసుమతి హుందాగా ఇద్దరి ముసలి దంపతుల ప్రక్కన కూర్చుంది. వాళ్ళని పలకరించింది. క్షణాలలో కబుర్లు చెప్పుకుంటున్నారు వాళ్ళు.

థియేటర్‌లో చీకట్లో వసుమతిని చాలా చేద్దామనుకుని ఆశపడి టిక్కెట్ కొన్న ఆ తెల్లచొక్కా అతను వసుమతిని తిట్టుకుంటూ కూర్చున్నాడు దూరంగా.


## యూత్ రివ్యూ

సోవియట్ - భారత యువలోకం మధ్య మైత్రి లక్ష్యానికి అంకితమై ఇంగ్లీషు, హిందీ భాషలలో ప్రచురించబడుతున్న సచిత్ర వారపత్రిక. ఆకర్షవంతమైన చిత్రాలతోపాటు సోవియట్ యువలోకం గురించి సమగ్రమైన సమాచారాన్ని తెలిపే పత్రిక నేడు తగ్గింపు రేట్లకు లభిస్తూ వుంది.

ఒక సంవత్సరంచందా: రు. 4-00
మూడు సంవత్సరాలకు: రు. 10-00

మీ చందాను మనియార్డరు ద్వారాగానీ, క్రాస్ చేసిన పోస్టల్ ఆర్డర్ ద్వారాగానీ ఈ క్రింది చిరునామాకు సరాసరి పంపండి.

సోవియట్ భూమి కార్యాలయం
44, త్యాగరాయ రోడ్డు,
మద్రాసు - 600 017